**కామెడీ కథ**

టీవీలో మెగా డైలీ సీరియల్ చూస్తూ సావిత్రి వెక్కిళ్ళు పెడుతూ ఏడుస్తుండగా భర్త సత్యనారాయణ ఆరోజే రిటైర్ అయి మెళ్ళో పూల దండతోసహా ఇంటి దగ్గర కారు దిగాడు.

సావిత్రి లోపలినుంచి బావురుమంటూ పరుగెత్తుకొచ్చే సరికి సత్యనారాయణ కంగారుపడి ''ఏమైంది సావిత్రీ?'' అడిగాడు.

సావిత్రి వెక్కిళ్ళు ఆపకుండానే ''సరోజ.. అదే మన సరూ.. సరూ!'' అంటూ ఆగింది.

సరోజ అంటే పక్కింటి అమ్మాయి, రోజూ వచ్చిపోతుండే అమ్మాయి అనుకుని ''అరెరె...ఏమయింది సరూకి?'' ఆందోళనగా అడిగాడు.

''సరూ...మన సరూ...'' సావిత్రికి వెక్కిళ్ళు ఆగడం లేదు.

సత్యనారాయణ ఆత్రుత ఆపుకోలేక మెళ్ళో దండ పీక్కుంటూ ''సరూకి ఏమయిందో చెప్పు తొందరగా!'' అరిచాడు గట్టిగా.

''మన సరూ చచ్చిపోయిందండీ!'' సావిత్రి పెద్దపెట్టున బావురుమంది.

''ఆఁ!! సరూ...చచ్చిపోయిందా?!'' నిర్ఘాంతపోతూ దండ తీసి పారేసాడు.

ఆరోగ్యంగా తిరిగే కాలేజీ పిల్ల ఎలా అకస్మాత్తుగా చనిపోయిందో అర్థం గాక ''ఇంతకీ ఎలా జరిగింది? ఎప్పుడు చచ్చిపోయింది?'' ఆతృతగా అడిగాడు.

''ఇప్పుడేనండి! నిక్షేపంగా ఆఫీసుకెళ్లి అందర్నీ పని బాగా చెయ్యమని దులిపేసి ఇంటికొచ్చి భోంచేసిందో లేదో వాంతులయి విరుచుకుపడి చచ్చిపోయింది!''

సావిత్రి గుండెలు బాదుకుని ఏడుస్తుంటే సత్యనారాయణ విడ్డూరంగా చూసి- పక్కింటమ్మాయి ఇంకా కాలేజీలో చదువుతూనే ఉంది. ఆ పిల్ల ఆఫీసుకెళ్లడమేంటి, స్టాఫ్‌ని దులిపెయ్యడమేంటి? వాంతులయి చనిపోవడమేంటి? అనుకోగానే హఠాత్తుగా అతనికి సరూ అంటే సావిత్రి మేనమామ కూతురు సరోజ అయి ఉంటుందని జ్ఞాపకం వచ్చి-

''ఓహో! ఆ సరోజ గురించి చెప్తున్నావా? అమ్మో! ఆవిడ పనిలో చండశాసనురాలు. ఆఫీసులో గిట్టనివాళ్ళు ఎవరో విషప్రయోగం చేసి చంపేసి ఉంటారు!'' పెద్ద డిటెక్టివ్ లెవెల్‌లో ఆలోచిస్తూ చెప్పాడు.

''అవునండి! సరూ జీవితంలో పైకెదిగిపోతుంటే చూడలేక కుళ్ళుతో చచ్చిపోతున్నారు? అసలు సరోజ సింగపూర్ ఫ్లైట్ దిగి వస్తున్నప్పుడు ఆ రాజాగాడు, నారాయణగాడు గుడ్లు మిటకరించి చూస్తుంటేనే, నేను అప్పుడే అనుకున్నా! వీళ్లిద్దరూ కలిసి ఏదో కుట్ర పన్నుతున్నారని!'' ముక్కు చీదుతూ బాధగా సావిత్రి అనేసరికి సత్యనారాయణ ఉలిక్కిపడి మళ్లీ కంగుతిన్నాడు.

తనకి తెల్సి సరోజ సింగపూర్ ఫ్లైటెప్పుడూ దిగనేలేదు. ఆ మాటకొస్తే ఎక్కితే కదా దిగడానికి! పైగా ఆమె ఆఫీసు కొలీగ్స్ పేర్లు పెళ్లాంకెట్లా తెలుసు?!

''ఇంతకీ సరోజ అంటే మీ మేనమామ కూతురే కదూ?!'' అనుమానంగా అనగానే సావిత్రి మళ్ళీ పెద్దపెట్టున రోదిస్తూ ''మీరు నాకెక్కడ దొరికారండీ బాబూ! ప్రతిరోజూ మొత్తం డైలీ సీరియల్స్ రాత్రిళ్ళు నేను నిద్రపోకుండా చూసినది చూసినట్టు చెప్తున్నా. అన్నీ వినేసి ఈరోజు మీరు సరూ అంటే ఎవరని అడుగుతున్నారా? ఇంతకన్నా నువ్వు ఎవరివే అని నన్ను అడిగున్నా ఇంత బాధపడకపోదును!'' అంటూ ఇల్లెగిరిపోయేలా పెద్ద పెట్టున రోదించసాగింది.

అతను నిలువు గుడ్లేసుకుని చూసి ''అంటే...అంటే..నువ్వింతసేపు ఏడుస్తున్నది డైలీ సీరియల్ హీరోయిన్ సరోజ చచ్చిపోయిందనా?'' ఆశ్చర్యంగా అడిగాడు.

''కాక? మన పక్కింటి అమ్మాయో, మా మేనమామ కూతురో అనుకున్నారా?''

''నీ ఏడుపు వాల్యూం లెవెల్ చూసి అట్లాగే అనుకున్నా''

''ఛీ ఛీ! పెళ్లయి పాతికేళ్లయినా డైలీ మెగా సీరియల్ ముప్పై ఏళ్ళబట్టి చూస్తున్నా మీకసలు ఏమీ అర్థం కావడం లేదు. పాపం తల్లిలేని మాధవి ఎలా బ్రతుకుతుందో? సరోజ పోయాక గౌతమ్ గతి ఏమవుతుందో?'' అంటూ పెద్ద పెట్టున బాధపడి వెంటనే మళ్లీ నవ్వుతూ ''అయినా ఏమండీ! ఇప్పుడు మీరు రిటైర్ అయిపోయారుగా! రేపట్నించి మనం ఇద్దరం ఎంచక్కా డైలీ సీరియల్స్ చూస్తూ డిస్కస్ చేసుకోవచ్చు!'' మురిపెంగా అన్నది.

సత్యనారాయణ కోపంగా చూసి ''చాలు చాలు! నీ దిక్కుమాలిన సీరియల్స్ చూసే కన్నా ఏ నుయ్యో గొయ్యో చూసుకుంటాను!'' గట్టిగా అన్నాడు.



వెంటనే సావిత్రి మళ్లీ మరో రౌండు ఏడుపు ప్రారంభించింది.

''చక్కగా ఎన్నో కలలు కంటూ ఈయన రిటైరయ్యాక డైలీ మెగా సీరియల్స్ చూస్తూ ఎంచక్కా గడపవచ్చు కదా అనుకుంటే ఇట్లా అంటాడేంటి దేముడా! నాకు చావు రాదా!! ఇక నేను బ్రతకను! ఓ యమధర్మరాజా! నన్ను వెంటనే తీసుకు పో! ఎక్కడున్నావు? ఎక్కడున్నావు?''


★ ★ ★

''ఇక్కడే ఉన్నాను!'' యమధర్మరాజు గట్టిగా అరచి చెప్పాడు.

చిత్రగుప్తుడు తనకోసం వెదుకుతూంటే హోటల్‌లో కూర్చున్న యమధర్మరాజు ''చిత్రగుప్తా! ఇదిగో...ఇదిగో ఇక్కడ'' అంటూ పిలిచేసరికి గుప్తా ఆశ్చర్యంగా పరుగెత్తుకొచ్చి-

''ప్రభూ! మీరిక్కడున్నారా? మీకోసం అతల

వితల పాతాళ లోకాలన్నీ వెదికి వెదికి అలసిపోయాము!'' ఆయాసంగా చెప్పాడు. యమధర్మరాజు కోకోకోలా బాటిల్ అందించి ''చిత్రగుప్తా! ఒక ముఖ్యమైన వ్యక్తిని తీసుకుపోవడానికి భూమ్మీదకి రాక తప్పలేదయ్యా!'' చెప్పాడు.



''ముఖ్యమైన వ్యక్తా?

ఎవరు రాజా?'' చిత్రగుప్తుడు ఆశ్చర్యంగా అడిగాడు.

''మిస్టర్ గుప్తా! జాగ్రత్తగా విను! లోగడ మనం సతీ సావిత్రి అనే పతివ్రతా శిరోమణి భర్త అయిన సత్యవంతుణ్ణి మన లోకానికి తీసుకుపోయే ప్రయత్నంలో విఫలమయ్యాం! ఆమె తన ప్రతిభతో భర్తని కాపాడుకుంది. ఇప్పుడు ఆ సతీ సావిత్రి కలియుగంలో సైతం సావిత్రిలా జన్మించగా ఆమె భర్త సత్యనారాయణ ఇవాళ ప్రభుత్వోద్యోగిగా రిటైర్ అయ్యాడు. అతన్ని మనం వెంటనే తీసుకుపోవాలి. అయితే సావిత్రి తన గడుసుతనంతో మనల్ని కట్టిపడేసి సత్యనారాయణ ప్రాణాల్ని కాపాడే ప్రమాదం ఉంది. కావున అట్టి పరిస్థితుల్లోనూ మనం ఆమెకి మనం పతి ప్రాణాలు తప్ప ఇంకేం వరం కోరినా ఇవ్వొచ్చు. అర్థమైందా? పద వెంటనే వెళదాం'' అంటూ దున్నపోతు మీదకి లంఘించి కూర్చుని గద చేతిలోకి తీసుకున్నాడు.

చిత్రగుప్తుడు హడావిడి పడుతూ ''ప్రభూ! సగం అయినది. సగం [illegible]యినది!'' అంటూ అరిచాడు. యమధర్మరాజు కోపంగా ''యముండా! చిత్రగుప్తా! ఇంత వివరించి చెప్పినమూ నీకు సగమే అర్థమైనదా? హా'' అంటూ అరిచాడు.

చిత్రగుప్తుడు కోకోకోలా హడావిడిగా త్రాగుతూ ''కాదు ప్రభూ! ఈ పానీయము త్రాగడం సగమే పూర్తయిందని చెబుతున్నాను!'' అంటూ పూర్తిగా త్రాగేసి ''ఇప్పుడు పదండి'' అంటూ యమధర్మరాజుని అనుసరించాడు.

★ ★ ★

ఆరోజు సావిత్రికి మహా ఉత్సాహంగా ఉంది. బెడ్రూంలోకి తొంగి చూస్తే భర్త ఏదో చదువుకుంటూ హాయిగా రేడియో వింటూ కనిపించేసరికి ''ఏంటండీ! ఇంకా ఇక్కడే ఉన్నారు? లేవండి...లేవండి!'' హడావిడిగా అన్నది.

ఆశ్చర్యంగా సత్యనారాయణ ''ఎక్కడికీ?'' అడిగాడు.

''ఇంకెక్కడికి.. అవతల మెగా సీరియల్ స్టార్ట్ కాబోతూంటే'' చెయ్యిపట్టి లాగింది.

''అమ్మో! ఛస్తే టీవీ సీరియల్స్ చూడను. నాకొద్దు'' గింజుకున్నాడు.

''భలేవాళ్ళే! మీతో కలిసి అభిమాన మెగా డైలీ సీరియల్స్ చూడాలని ఎంత ఉత్సాహంగా ఉన్నానో తెలుసా? పైగా ఇవాళ సీరియల్ ఒక లక్షా తొంభై తొమ్మిదివేల తొమ్మిది వందలా తొంభై తొమ్మిది ఎపిసోడ్లు పూర్తిచేసుకుని రెండో లక్ష భాగం ప్రసారం కాబోతోంది''

''ఏమిటీ! రెండో లక్ష భాగమా!'' మూర్ఛ వచ్చినంత పనయింది అతనికి.

''అబ్బా...అంతలా ఆశ్చర్యపోతారేంటి? అసలు 'అనంతసాగర తరంగాలు' సీరియల్ ఐదు లక్షల ఎపిసోడ్లు విజయవంతంగా కంప్లీట్ చేసుకుంది తెలుసా?''

''ఆఁ.. విజయవంతం!'' సత్యనారాయణ వేళాకోళంగా నవ్వి ''ఎవరు చూసినా చూడకున్నా ఎవరెంత తిట్టుకున్నా పట్టించుకోకుండా ఎపిసోడ్ల మీద ఎపిసోడ్లు గాల్లోకి వదులుతూ పోతే ఐదులక్షలేంటి నా బొంద జీవితాంతం ప్రసారం చెయ్యొచ్చు!'' వ్యంగ్యంగా చెప్పాడు.

వెంటనే సావిత్రి ''అబ్బా! జీవితాంతం.. ఎంత గొప్ప టైటిల్ చెప్పారండీ!'' అనగానే హాల్లోంచి గట్టిగా ఎవరో డైలీ సీరియల్ టైటిల్ సాంగ్ పాడుతున్నట్టుగా కర్ణకఠోరమైన గొంతుతో-

''జీవితాంతం! తంతం! జీవితాంతం!'' అని వినిపించింది.

''అమ్మో! ఇంట్లోకెవరో ఆడదొంగ దూరింది!'' అంటూ సత్యనారాయణ ఒక్క గెంతులో హాల్లోకి వెళ్ళి చూస్తే గుంపుగా ఆడవాళ్ళు. వాళ్ల మధ్య పాట పాడుతూ ఓ లావుపాటి ఆవిడ!

సావిత్రి అందర్నీ సంబరంగా చూసి ''రండి! రండి! కరెక్ట్ టైంకి వచ్చారు!'' అని భర్తతో ''ఈవిడ ఆండాళమ్మగారని మన కాలనీనే. శత సహస్ర సీరియల్‌మణి అనే బిరుదు ఉందీవి

వారణాసి రామకృష్ణ

డకి'' అని ఆవిడకి భర్తని పరిచయం చెయ్యగానే ఆండాళమ్మ మళ్లీ టైటిల్‌సాంగులా ''నారాయణా! సత్యనారాయణా! యణా! యణా! సత్య నారాయణా!'' అని పాడింది పరమ చండాలంగా.

సావిత్రి పనికుర్రాడ్ని పిలుస్తూ ''వైకుంఠం! అందరికీ కాఫీలు పట్రా'' కేకేసింది.

వెంటనే ఆండాళమ్మ టైటిల్ సాంగులా ''వై-కుంఠం! వై-కుంఠం! వైకుంఠం!'' అని పాడింది.

సత్యనారాయణ ఆశ్చర్యంగా చెవులు గట్టిగా మూసుకుంటూ. ''ఈవిడకిదేం జబ్బు? ఏ పేరు విన్నా చండాల రాగం తీస్తోంది'' అడిగాడు.

సావిత్రి నవ్వుతూ ''అదే వారి డైలీ సీరియల్స్ స్పెషాలిటీ! సరే సరేగానీ అందరూ సోఫాల్లో కూర్చోండి. అవతల మెగా డైలీ సీరియల్ వచ్చే టైం అవుతోంది!'' అంటూ అందర్నీ కూర్చోబెట్టి టీవీకి కొబ్బరికాయ కొట్టి హారతిచ్చి కళ్లకద్దుకోగానే అవతల వీధి తలుపు చప్పుడయింది.

సావిత్రి తలుపుతీసి చూస్తే యమధర్మరాజు! వెంటనే సావిత్రి మొహంలో రంగులు మారాయి.

అప్రయత్నంగా ఆమె వికట నవ్వు నవ్వి ''యమధర్మరాజా! మరలా నా పతి ప్రాణంబులను గైకొనబోవ యేతెంచితివా? హహహా'' అని నవ్వింది.

యమధర్మరాజు కంగుతిని ''చూశావా గుప్తా! వెంటనే పాయింట్ పట్టేసింది'' అని సావిత్రితో-

''తల్లీ! పతివ్రతా శిరోమణీ! ఎన్ని యుగాలు గడిచాక కూడా ఈ కృతక భాషెందుకుగానీ చక్కగా తెలుగులో వాదించుకుందాం! నీ భర్త ప్రాణములు తప్ప మరేదైనా వరం కోరుకో! సరేనా!'' చెప్పాడు.

సావిత్రి మళ్లీ నవ్వి ''ఏ వరం కోరినా ఇస్తావా?'' అడిగింది.

''అమ్మో! ఏ వరం పడిదే ఆ వరం ఇవ్వ మూగాక ఇవ్వను! అప్పట్లో కొడుకుని ప్రసాదించమని కోరి, తీరా సరేనంటే మొగుడు లేకుండా కొడుకెలా పుడతాడంటూ ఫిటింగ్ ప్రశ్న వేసి ఇరుకులో పెట్టావు. ఈసారి అలా ఒప్పుకోను. మీ ఆయన ప్రాణాలు తప్ప మరేదైనా కోరుకో!''

''సరే అయితే. మా ఆయనతో కలిసి డైలీ సీరియల్ చూసే వరం ఇవ్వండి చాలు!'' వెంటనే యమధర్మరాజు తనలో 'ఏమి ఈ సీరియల్! కొంపదీసి ఇందులో మరో ఫిటింగేమీ లేదుకదా!' అనుకుని చిత్రగుప్తునితో ''గుప్తా! ఈ డైలీ సీరియల్ సంగతేంటి?'' అడిగాడు.

గుప్త నవ్వుతూ ''అబ్బే పెద్ద ప్రమాదం లేదు ప్రభూ! భర్తతో కలిసి మెగా డైలీ సీరియల్ చూడడం పూర్తయ్యాక అతన్ని మనం తీసుకుపోవచ్చును'' చాలా తేలికగా చెప్పేసరికి యమధర్మరాజు సావిత్రితో ''తల్లీ! నువ్వెళ్ళి మీ ఆయనతో కలిసి మెగా సీరియల్ చూశాక అతనిని పంపుము!'' అన్నాడు.

వెంటనే సావిత్రి కొంటెగా నవ్వి ''ఎక్కడికి పంపుదును?'' అన్నది. యమధర్మరాజు భ్రుకుటి ముడిచి ''సావిత్రీ! ఏమీ వెటకారము? సీరియల్ చూసిన వెంటనే నీ భర్తను నాతో పంపుము!'' కోపంగా అన్నాడు.

సావిత్రి ముసిముసిగా నవ్వి ''పంపుదును...పంపుదును'' అని లోపలికి వెళ్లిపోయింది.

కొంతసేపు గడిచాక యమధర్మరాజు ''సావిత్రీ! సీరియల్ అయిపోయినదా?'' ప్రశ్నించాడు.

''ఇంకా కాలేదు రాజా!''



గంటలు, నెలలు, గడిచాక మళ్లీ ఆశగా ''సావిత్రీ! మెగా సీరియల్ ముగిసెనా?'' అడిగాడు.

''ఇంకనూ కాలేదు రాజా!'' నవ్వుతూ చెప్పింది. మళ్లీ మరో పదేళ్ళు గడిచాక ప్రశ్నిస్తే అదే జవాబు చెప్పింది.

దాంతో ఒళ్ళు మండి ''సావిత్రీ! ఇది ఏమి? డైలీ సీరియల్ పూర్తవుటకు ఇంకెంత కాలం పట్టును?'' కోపంగా అన్నాడు.

''చచ్చిపోయిన సరోజ మళ్ళీ బ్రతికింది రాజా!''

''హా! సరోజ! ఈ సరోజ ఎవరు మధ్యలో!''

''ఇంకెవరు రాజా! డైలీ సీరియల్ హీరోయిన్!''

''ఇంతకీ హీరోయిన్ మళ్లీ ఎప్పుడు చచ్చును? ఆ సీరియల్ ఇంకెప్పటికి పూర్తవును?''

సావిత్రి జవాబివ్వక పగలబడి నవ్వి లోపలికి వెళ్లిపోయింది. చిత్రగుప్తుడు మెల్లిగా ''ప్రభూ! నాకు తెలిసి టీవీ మెగా సీరియల్స్‌లో ఎవ్వరూ చావరు. కేవలం చంపెదరు!'' రహస్యం చెప్పాడు. యమధర్మరాజు ఉలిక్కిపడి ''చంపెదరా...ఎవ్వర్ని?'' అడిగాడు.

''ఇంకెవర్ని...చూసే ప్రేక్షకుల్ని. అవతల మన సత్యవంతుడే కాక బోలెడు మంది ఇలాగే నిత్యం నరకం చవిచూస్తున్నారు!''

యమధర్మరాజు విసుగ్గా తల ఆడిస్తూ ''మన లోకంలో అనుభవించాల్సిన శిక్షల్ని ఇక్కడ వీళ్ళే విధించడమేంటి? దీనికొక శాశ్వత పరిష్కారం ఆలోచించాలి. త్రిమూర్తులతో అర్జెంటు మీటింగ్ పెట్టి దృశ్యతరంగాలు గాలిలో ప్రయాణించకుండా అవరోధం కల్పించాలి. భూమ్మీద నరకం అప్పటికిగానీ తొలగిపోదు. పద పోదాం!'' అంటూ దున్నపోతు మీద కూర్చోగానే ''ఝుమ్'' అని ఇద్దరూ అదృశ్యమైపోయారు.

''ఉందిలే మంచికాలం ముందు ముందునా?'' పాట ఝుమ్మని చెవిలో మోగగానే కునికిపాట్లు పడుతున్న సత్యనారాయణ ఉలిక్కిపడి లేచాడు. అప్పటిదాకా జరిగినదంతా కల అని గుర్తుచేస్తున్నట్టుగా ఛానెల్స్ మారుస్తున్న అర్ధాంగి కనబడింది.

★

## అదండీ కథ!

*దాదాపు రెండేళ్ల క్రితం 'పెళ్లి' (?) చేసుకున్న సుమన్ రంగనాథన్-గౌతమ్ కపూర్‌లు ఇప్పుడు విడిపోయారట. ఆ సంగతిని సుమన్ స్వయంగా అందరికీ పనిగట్టుకుని మరీ చెబుతోంది. 'ఇక నా దృష్టంతా పూర్తిగా సినిమా కెరీర్‌పైనే' అని కూడా సెలవిస్తోందిట సుమన్.*